# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 45
పేజీలు : 08 | వెల: రూ.5/-
శనివారం
నవంబర్ 02, 2024
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net


## బీసీ కమిషన్ కు ఘన స్వాగతం



2లో..

- మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యేలు
- నివేదించిన ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్
- వినతులు అందజేసిన పలువురు

# బ్యాడ్ 'పోలీసింగ్'

### గీత దాటుతున్న ఖాకీలు

- సంపాదనే లక్ష్యంగా అడుగులు
- అమాయకులను వేధిస్తూ అప్రతిష్ఠ
- పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కాలంటేనే జంకుతున్న జనం
- ఫాస్ట్ ఫుడ్ సెంటర్ వ్యవహారంతో పరువు పోగొట్టుకున్న పోలీసులు



ఒకప్పుడు కేసుల ఛేదనలో ముందున్న వరంగల్ పోలీసులు నేడు కొందరి స్వార్థబుద్ధితో వివాదాలకు కేంద్ర బిందువుగా మారుతున్నారు. అనవసర విషయాల్లో తలదూర్చి అప్రతిష్ఠపాలవుతున్నారు. సంపాదనే లక్ష్యంగా అక్రమాలకు తెరతీస్తున్నారు. ఒకవైపు ఫ్రెండ్లీ పోలీస్ అంటూనే సామాన్యులు పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కాలంటేనే భయపడే పరిస్థితిని తీసుకొస్తున్నారు. ఒక్కసారి అడుగు పెట్టారంటే వారిని పీల్చి పిప్పి చేసే వరకు వదిలిపెట్టడం లేదు. రాజకీయ నాయకుల అండదండలతో అక్రమార్కుల కొమ్ము కాస్తూ అమాయకులను వేధింపులకు గురిచేస్తున్నారు. ఉద్యోగ ధర్మాన్ని పక్కనబెట్టి అడ్డదారిలో సంపాదనకోసం బరితెగిస్తున్నారు. పోలీసుల వేధింపులతో వరంగల్ లోని ఒక ఫాస్ట్ ఫుడ్ సెంటర్ యజమాని ఏకంగా మట్టెవాడ పోలీస్ స్టేషన్ లోనే ఆత్మహత్యా యత్నం చేయడం చర్చనీయాంశమైంది. తన చావుకు ఎస్సై వేధింపులే కారణమంటూ వీడియో నెట్టింటా వైరల్ గా మారింది. ఈ ఘటనతో పోలీసుల పరువు గంగపాలైంది. అయితే తనను ఎవరూ వేదించలేదంటూ సదరు ఫాస్ట్ ఫుడ్ సెంటర్ యజమాని మరో వీడియో విడుదల చేసినప్పటికీ దానిని ఎవరూ నమ్మే పరిస్థితి లేదు. పోలీసులు ఎన్ని ఇబ్బందులకు గురిచేసి ఉంటే ఆత్మహత్యా ప్రయత్నం చేసి ఉంటాడన్న ప్రచారం సాగుతోంది. ఇప్పటికైనా పోలీసుల ఆలోచనలో మార్పు రావాలని, ప్రజలకు అండగా నిలువాలని ప్రజలు కోరుతున్నారు.

- వరంగల్ వాయిస్, వరంగల్ ప్రతినిధి

వివరాలు2లో..



## సీఎంను కలిసిన కేయూ వీసీ

కాకతీయ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్ లర్ గా బాధ్యతలు చేపట్టిన ఆచార్య కె.ప్రతాపరెడ్డి మొట్టమొదటి సారిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని శనివారం హైదరాబాద్ లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించారు. శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా కేయూ స్థితిగతులపై వారు కొద్దిసేపు చర్చించారు. – వరంగల్ వాయిస్, కేయూ

## ఢిల్లీలో పిల్లులు.. గల్లీలో విమర్శలు

- విచిత్రంగా బీజేపీ నేతల తీరు
- విమర్శించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి





8లో..

## మీ సేవలు స్ఫూర్తిదాయకం

- వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా
- ఉద్యోగ విరమణ పొందిన వారికి ఘన సన్మానం



8లో..

## స్టూడెంట్స్ గెట్ అప్

- విద్యార్థులకు వేకప్ కాల్స్
- పదిలో ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యం
- తల్లిదండ్రుల్లా బాధ్యతలు తీసుకుంటున్న ఉపాధ్యాయులు



# బ్యాడ్ 'పోలీసింగ్'

- గీత దాటుతున్న ఖాకీలు
- సంపాదనే లక్ష్యంగా అడుగులు
- అమాయకులను వేధిస్తూ అప్రతిష్ఠ
- పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కాలంటేనే జంకుతున్న జనం
- ఫాస్ట్ ఫుడ్ సెంటర్ వ్యవహారంతో పరువు పోగొట్టుకున్న పోలీసులు

**వరంగల్ వాయిస్, వరంగల్ ప్రతినిధి :** ప్రజలకు రక్షణగా ఉండాల్సిన కొందరు పోలీసులు గీత దాటుతున్నారు. అక్రమార్జనే లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు. బెదిరింపులకు పాల్పడుతూ అందిన కాడికి దండుకుంటున్నారు. నెలవారి వసూళ్లకు తెరతీశారు. ఆయా షాపుల్లో జరుగుతున్న వ్యాపారాన్ని బట్టి ఒక్కో దుకాణ యజమానికి ఒక్కో రేట్ ఫిక్స్ చేస్తున్నారు. ప్రతి నెల వారు చెప్పిన మొత్తం ఇవ్వాలంటూ హుకుం జారీ చేస్తున్నారు. ఎవరైనా కాదు..కూడదు అంటే వారిని వేధింపులకు గురి చేస్తున్నారు. జీవితంలో ఇక వ్యాపారమే చేయలేమంటూ పారిపోయేలా పరిస్థితులు కల్పిస్తున్నారు. పరిధి దాటి ప్రవర్తిస్తున్నారు. ఇలాంటి సంఘటనే వరంగల్ లో నెట్టింట వైరల్ గా మారింది. పోలీసుల పరువును గంగపాలు చేసింది.

### వివాదాల్లో పోలీసులు..

ఇటీవలనే ఒక సీఐ స్థాయి అధికారి తను నివాసముంటున్న అపార్ట్ మెంట్ లోనే ఉన్న బాలికపై లైంగిక దాడికి పాల్పడిన విషయం మరువక మునుపే మరో ఎస్సై చిరు వ్యాపారులను వేధించడం నగరంలో కలకలం రేపుతోంది. ప్రజలకు రక్షణగా నిలువాల్సిన పోలీసులే భక్షకులుగా మారితే రక్షణ ఏది అన్న ప్రశ్న ఉద్భవిస్తోంది. క్రమ శిక్షణ చర్యల్లో భాగంగా సదరు సీఐని ఉద్యోగం నుంచి సస్పెండ్ చేసినప్పటికీ ప్రజల్లో వారికున్న గౌరవాన్ని కోల్పోతున్నారు. అదే విధంగా రాజకీయ నాయకులకు కొమ్ము కాస్తూ పోలీసులు ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారన్న ప్రచారం సాగుతోంది. సివిల్ కేసుల్లోనూ తలదూర్చుతూ సామాన్య ప్రజానీకానికి దూరమవుతున్నారు. వాహనాల తనిఖీ పేరుతోను సామాన్యులను ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. వివిధ వ్యాపారాలకు వినియోగించుకుంటున్న ఓమిని వంటి వాహనాలను పోలీస్ స్టేషన్ కు తరలించి వారితో బేర సారాలు ఆడుతున్నట్లు ప్రచారంలో ఉంది. ఇటీవలికాలంలో ఒక వాహన యజమానినుంచి పోలీసులు ఉపయోగిస్తున్న ఇన్నోవా వాహనానికి కావాల్సిన టైర్, ట్యూబ్ కొనివ్వాలంటూ డిమాండ్ చేసినట్లు సమాచారం.

### ఎస్సై వేధిస్తున్నాడు..

తనను డబ్బులకోసం ఎస్సై వేధిస్తున్నాడంటూ ఏకంగా మట్టెవాడ పోలీస్ స్టేషన్ లోనే ఫాస్ట్ ఫుడ్ సెంటర్ యజమాని శ్రీధర్ ఆత్మహత్యా ప్రయత్నం చేయడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పెట్రోల్ బాటిల్ తో పోలీస్ స్టేషన్ కు వచ్చిన ఆయన దానిని ఒంటిపై పోసుకొని నిప్పు అంటించుకునే ప్రయత్నం చేశారు. పోలీసుల వేధింపులతో సెంటర్ నడవకపోతే దొంగతనం చేసి బతకాలా అంటూ ప్రశ్నించారు. సీపీ సార్ నమస్కారం..కొండా మురళి సార్ నమస్కారం.. నేను శ్రీధర్ ని. వరంగల్ కొత్తవాడ ప్రాంతంలో తెలంగాణ ఫాస్ట్ ఫుడ్ సెంటర్ నిర్వహిస్తున్నా..కష్టపడి పైకి వచ్చినా..నా లాంటి వారిని బతకనిస్తలేరంటూ ఆరోపించారు. తన చావుకు ఎస్సై విఠల్ కారణమంటూ బహిరంగంగానే ఆరోపణలు చేశారు. నెల రోజులుగా తనను వేధింపులకు గురి చేస్తున్నట్లు చెప్పుకొచ్చారు. సెంటర్ ముందు వాహనాలను పార్క్ చేస్తే ఫొటోలు తీసి భయభ్రాంతులకు గురి చేస్తున్నారంటూ ఆరోపించారు.

### మానసిక క్షోభ..

పోలీసుల వేధింపులకు సామాన్యులు మానసిక క్షోభ అనుభవిస్తున్నట్లు తెలుస్తోంది. ఫాస్ట్ ఫుడ్ సెంటర్ యజమాని శ్రీధర్ ను పోలీసులు ఎలాంటి వేధింపులకు గురిచేసి ఉంటే ఆయన ఆత్మహత్య చేసుకునే స్థితికి చేరుకుని ఉంటాడని గుసగుసలు వినిపిస్తున్నాయి. అయితే కొందరు అక్రమార్కులతో పోలీస్ కుటుంబానికే మచ్చ వస్తోంది. కొందరు చేసే తప్పులకు అందరు బలి కావాల్సి వస్తోంది. ఇలాంటి వారిని గుర్తించి వారికి ప్రాధాన్యం లేని ప్రాంతాలకు బదిలీ చేయాలన్న వాదన వినిపిస్తోంది. అదే విధంగా ఉద్యోగంలో చేరగానే కోట్లకు పడగెడుతున్న వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు. వారి అక్రమ సంపాదనపై విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించి దోషులను బట్టబయలు చేయాలి. అప్పుడే పోలీస్ స్టేషన్లలో సామాన్యులకు న్యాయం అభిస్తుందంటున్నారు. ఈ దిశగా పోలీస్ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని నగర ప్రజలు కోరుతున్నారు.



# బీసీ కమిషన్ కు ఘన స్వాగతం

- మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యేలు
- నివేదించిన ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్
- వినతులు అందజేసిన పలువురు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన రిజర్వేషన్ దామాషాను ఖరారు చేసేందుకు బృహత్తర కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ అన్నారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన రిజర్వేషన్ల దామాషాను ఖరారు చేసే అంశంపై బహిరంగ విచారణలో భాగంగా రాష్ట్ర బీసీ కమిషన్



బృందం ప్రజలు, ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, వివిధ కుల సంఘాల ప్రతినిధుల నుంచి విజ్ఞప్తులను స్వీకరించారు. శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మికి ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించి వారి అభిప్రాయాలు, విజ్ఞప్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ మాట్లాడుతూ బహిరంగ విచారణలో ఆరు జిల్లాల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తుందన్నారు. రాష్ట్రంలో ఈ నెల 6వ తేదీ నుంచి సామాజిక ఆర్థిక విద్య ఉపాధి రాజకీయ కుల సర్వే ప్రారంభమవుతుందని, సర్వే జరిగేటప్పుడు తమ వివరాలను ఎన్యుమరేటర్లకు అందించాలన్నారు. అదేవిధంగా ఆయా జిల్లాల కలెక్టర్లు బీసీల స్థితిగతుల ఆధారంగా వివిధ అవకాశాల కల్పనకు కృషి చేయాలన్నారు. కొన్ని కులాలు తమ కులం పేర్లను మార్చాలని నివేదించారని, కమిషన్ ఇందుకు ప్రయత్నం చేస్తుందన్నారు. సామాజిక ఆర్థిక విద్య ఉపాధి రాజకీయ కుల సర్వే లో అన్ని కుటుంబాలు నమోదు అయ్యేట్లుట్లు ఆయా కుల సంఘాల ప్రతినిధులు కృషి చేయాలని సూచించారు. అంతకుముందు జిల్లా కలెక్టరేట్ లో ప్రజాభిప్రాయ బహిరంగ విచారణకు వచ్చిన బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, సభ్యులు జయప్రకాశ్, సురేందర్, బాల లక్ష్మీలకు హనుమకొండ, వరంగల్, ములుగు, జనగాం జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, డాక్టర్ సత్య శారద, దివాకర, రిజ్వాన్ భాషా షేక్ మొక్కలను అందించి ఘన స్వాగతం పలికారు. హనుమకొండ కలెక్టర్లో సాయంత్రం ఆరు గంటల వరకు సుదీర్ఘంగా సాగిన బీసీ కమిషన్ విచారణలో హనుమకొండ, వరంగల్, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, జనగామ



జిల్లాల కలెక్టర్లు, అక్కడి నుంచి వచ్చిన కుల సంఘాల ప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు, ప్రజల నుంచి అభ్యర్థనలను స్వీకరించారు.

### స్వాగతం పలికిన ఎమ్మెల్యే..

నగరానికి వచ్చిన బీసీ కమిషన్ సభ్యులను హరిత కాకతీయ వద్ద వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాస్ రావు, ఈవి శ్రీనివాస్ రావు, అనిల్, బొమ్మనాపెల్లి అశోక్ రెడ్డి, కార్పొరేటర్ సయ్యద్ విజయ రాజాలి, జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షులు బంక సరళ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బంక సంపత్, అంబేద్కర్ రాజు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### బీసీలను అభివృద్ధి చేయాలి :

**– సాయిని నరేందర్**

సకల సామాజిక రంగాల్లో బీసీల జనాభా దామాషా ప్రకారం వాటా కేటాయించి వారి సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్ కోరారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు చేస్తున్న ప్రయత్నాలకు బీసీ సమాజం పక్షాన ఆయన ధన్యవాదాలు తెలిపారు. అనంతరం 35 డిమాండ్లతో కూడిన తన నివేదికను బీసీ కమిషన్ కు అందించడంతోపాటు కలెక్టర్ కార్యాలయంలో జరిగిన బహిరంగ విచారణలో వినిపించారు.

### 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి..

సమాజంలో వివక్షతకు, అణచివేతకు గురవుతున్న బీసీలకు చట్టసభల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు తాటిపాముల వెంకట్ రాములు, ప్రధాన కార్యదర్శి నేదునూరి రాజమౌళి డిమాండ్ చేశారు. రిజర్వేషన్ కేటగిరిలో పోటీ చేసే అభ్యర్థుల ఖర్చును ప్రభుత్వమే భరించాలని కోరారు. ఈ మేరకు బీసీ కమిషన్ సభ్యులకు వినతి పత్రం అందజేశారు.



# కుల గణనపై సమీక్ష సమావేశం

## హాజరైన ఎమ్మెల్యే భూక్యా మురళీ నాయక్




**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కుల గణన సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న మహబూబాబాద్ శాసనసభ్యులు డా. భూక్యా మురళీ నాయక్, డీసీసీ అధ్యక్షుడు భరత్ చందర్ రెడ్డి, డోర్నకల్ శాసనసభ్యుడు విప్ డాక్టర్ రామచంద్ర నాయక్, భారతీయ సంస్కృతికి బలమైన సాంస్కృతిక పునాది అయిన కులం, చివరిసారిగా 1931లో భారత జనాభా గణనలో చేర్చబడింది. కుల గణన అంటే ఏమిటి? కుల గణన అనేది భారతదేశ జనాభాలో కులాల వారీగా విభజించడాన్ని చేర్చడం. ఈ జనాభా వ్యాయామం నిర్దిష్ట ప్రాంతం లేదా దేశంలోని వివిధ కుల సమూహాల పంపిణీపై సమగ్ర డేటాను సేకరించడం లక్ష్యంగా పెట్టుకుంది. దేశంలోనే తొలిసారిగా తెలంగాణ రాష్ట్రంలో కులగణన చేపట్టనున్నారు. తెలంగాణలో నవంబర్ 6 నుంచి కులగణన ప్రక్రియను ప్రారంభించనున్నారు. ఆ రోజే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ఆహ్వానించాలని రేవంత్ ప్రభుత్వం యోచిస్తోంది. ఈ మేరకు గాంధీ భవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. కుల గణనతో బీసీల్లో పెనుమార్పులు రాబోతున్నాయని ఎమ్మెల్యే డా.మురళీ నాయక్ అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ, హైకోర్టు ఉత్తర్వుల మేరకే కుల గణన చేస్తున్నామని ఎమ్మెల్యే డా.మురళీ నాయక్ చెప్పారు. స్థానిక సంస్థలు, ఇతర రంగాల రిజర్వేషన్లపై ఆలోచన చేస్తున్నామని, డిసెంబర్ లో సర్వే నివేదికను ప్రభుత్వం ముందు ఉంచుతామని ఎమ్మెల్యే డా.మురళీ నాయక్ తెలిపారు. కుల గణనపై ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని విమర్శించారు. నవంబర్ 6 నుంచి 30 వరకు రాష్ట్రవ్యాప్తంగా కులగణన జరగనుంది. ఇందుకోసం 75 ప్రశ్నలను సిద్ధం చేశారు. కుటుంబసభ్యుల పేర్లు, మతం, కులం, వయసు, మాతృభాష, మొబైల్, రేషన్ కార్డు నంబర్, విద్య, ఉద్యోగం, వృత్తి, ఆదాయం, భూములు, ఇల్లు, రిజర్వేషన్ ప్రయోజనాలు, వలసలు, ఐదేళ్ల నుంచి తీసుకున్న లోన్ల గురించి ఇన్ఫర్మేషన్ అడుగుతారు. ఎలాంటి ఫొటోలు, డాక్యుమెంట్లు తీసుకోరు. సర్వే టైంలో కుటుంబ యజమాని ఒకరు ఉంటే సరిపోతుంది. ఎమ్మెల్యే డా.మురళీ నాయక్ చెప్పారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు, మండల అధ్యక్షులు, వార్డ్ కౌన్సిలర్, మాజీ జడ్పీటీసీ, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్, వార్డ్ మెంబర్లు, గ్రామ అధ్యక్షులు, జిల్లా నాయకులు, మండల నాయకులు, గ్రామ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ఓబీసీ జిల్లా కోఆర్డినేటర్ గా కల్లూరి పవన్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కాంగ్రెస్ పార్టీ హనుమకొండ జిల్లా కోఆర్డినేటర్ గా కల్లూరి పవన్ ను నియమించినట్లు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా ఓబీసీ చైర్మన్ బొమ్మతి విక్రమ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత కొన్ని నెలల నుంచి కాంగ్రెస్ పార్టీలో చురుకుగా పని చేస్తున్న క్రమంలో నియమించడం జరిగింది. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ నా పై నమ్మకంతో ఈ పదవి ఇచ్చినందుకు ఓబీసీ బలోపేతం కోసం కృషి చేస్తానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పథకాలను ప్రజలకు అందే విధంగా కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన ఓబీసీ రాష్ట్ర చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్, 53వ డివిజన్ అధ్యక్షులు బాబా భాయ్, కాంటెస్టెడ్ కార్పొరేటర్ ఎర్ర మహేందర్, నాయకులు రాజేష్, సంఘాల ప్రణీత్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి



**వరంగల్ వాయిస్, పరకాల :** స్వీప్ కార్యక్రమంలో భాగంగా పరకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ ఓటరు నమోదు చేసుకోవాలని విద్యార్థులకు ఆర్డీఓ డాక్టర్ కె నారాయణ పిలుపునిచ్చారు. కొంత మంది విద్యార్థులకు బీఎల్ఓల ద్వారా ఓటరు నమోదు దరఖాస్తులు పంపిణీ చేసి అవసరమైన డాక్యుమెంట్స్ సమర్పించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పరకాల నియోజకవర్గం నోడల్ అధికారి ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు, పరకాల తహసీల్దార్ ఏవీ బాస్కర్, నాయబ్ తహసీల్దార్ సూర్య ప్రకాష్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సంతోష్, బీఎల్ఓలు, లెక్చరర్లు పాల్గొన్నారు.

# బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ ను కలిసిన అనిత రామకృష్ణ



**వరంగల్ వాయిస్, పరకాల :** హనుమకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ ను శనివారం మర్యాదపూర్వకంగా పరకాల మున్సిపల్ చైర్ పర్సన్ సోదా అనిత రామకృష్ణ కలిసి పుష్పగుచ్ఛం, అంబేద్కర్ జ్ఞాపికను అందజేశారు. వారి వెంట మున్సిపల్ కౌన్సిలర్స్ నల్లెల్ల జ్యోతి అనిల్ కుమార్, పసుల లావణ్య రమేష్, బండి రాణి సదానందం గౌడ్, మార్క ఉమా రఘుపతి గౌడ్, ఏకు రాజు, పంచగిరి జయమ్మ హరిప్రసాద్, తదితరులు ఉన్నారు.

# ఉమ్మడి వరంగల్ జిల్లా హాకీ జట్టులో మర్కజీ విద్యార్థి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నవంబర్ 5, 6 తేదీలలో సంగారెడ్డిలో నిర్వహించబోయే రాష్ట్రస్థాయి ఆటల పోటీలలో వరంగల్ ఉమ్మడి జిల్లా నుంచి హాకీ పోటీల్లో పాల్గొనడానికి ప్రభుత్వ మర్కజి ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థి తిక్క అరవింద రాజ్ ఎంపికయ్యాడు. హాకీ కృడలో కుడి వైపు ఉండి చక్కని ప్రతిభ కనబరిచినందుకు జిల్లా స్థాయి క్రీడా నిపుణులు తనను ఎంపిక చేసినట్లు అరవింద్ రాజ్ తెలిపాడు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.మనోహర్ నేతృత్వంలో శిక్షణ పొందిన అరవింద రాజ్ రాష్ట్రస్థాయి హాకీ పోటీలలో చక్కని ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి జట్టులో చోటు సంపాదించుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.వి. రామారావు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు అభినందించారు.

# హనుమకొండకు చేరుకున్న బీసీ కమిషన్

## మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యేలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** స్థానిక సంస్థల రిజర్వేషన్ల దామాషా (కుల గణన )పై ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా శనివారం నిర్వహించే సమీక్షా సమావేశానికి తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, రంగు బాలలక్ష్మిలు వరంగల్ నగరానికి విచ్చేశారు. హరిత కాకతీయ వద్ద వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట నియోజకవర్గ శాసనసభ్యుడు కేఆర్ నాగరాజు , వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాస్ రావు, ఈవీ శ్రీనివాస్ రావు, అనిల్, బొమ్మనపెల్లి, అశోక్ రెడ్డి, కార్పొరేటర్ సయ్యద్ విజయ రజాలి, జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షులు బంక సరళ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బంక సంపత్, అంబేద్కర్ రాజు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన వి`ద్యార్థులు




**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ ప్రభుత్వం గురుకుల పాఠశాలలకు మెస్ చార్జీలు పెంచినందుకు గాను వరంగల్ ఉర్సు గుట్ట మహాత్మ జ్యోతిబాపూలే బాలికల పాఠశాల, కళాశాల విద్యార్థులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఉర్సు గుట్ట పాఠశాల, కళాశాలలో కేక్ , మిఠాయిలు పంచడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రుల బృందం, విద్యార్థినిలు

# రాష్ట్ర స్థాయి పోటీలకు మణి మార్షల్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రేపు రంగారెడ్డిలో జరుగుతున్న రాష్ట్రస్థాయి ఎస్ జీఎఫ్ఐ కరాటే పోటీలకు నగరంలోని గోల్డెన్ ఓక్ పాఠశాల కాపువాడ బ్రాంచ్ విద్యార్థి నాంపల్లి గీతిక సాయి 58 పై కేజీల విభాగంలో, ఏవీవీ పాఠశాల విద్యార్థిని వలబోజు హాసిని అండర్-38 కేజీల విభాగంలో వరంగల్ జిల్లా తరఫున ఎంపికైనట్లు కోచ్ గడదాసు మణికంఠ తెలిపారు. ఈ పోటీలలో ఎంపికైన విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు గోల్డెన్ ఓక్ పాఠశాల, ఏవీవీ పాఠశాల ప్రిన్సిపల్స్, మేనేజ్ మెంట్ వారు అభినందిస్తూ రాష్ట్రస్థాయి పోటీలలో విజయం సాధించాలని విద్యార్థులను ఆశీర్వదించారు.

## కుల గణన అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

### ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



**వరంగల్ వాయిస్, పరకాల :** హనుమకొండలోని డీసీసీ భవన్ లో ఏఐసీసీ ఆదేశానుసారం టీపీసీసీ పిలుపు మేరకు తెలంగాణ రాష్ట్ర సామాజిక ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల గణన సర్వేపై అవగాహనపై నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో ముఖ్య అతిథిగా పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి మాట్లాడుతూ కుల గణన కార్యక్రమం ద్వారా సామాజిక సమానత్వం, సంక్షేమం, అభివృద్ధి సాధించేందుకు ఉద్దేశించిన అవసరాలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. కుల గణన సర్వే కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా ప్రచారం చేయడం, వివిధ వర్గాల ప్రజలను భాగస్వాములుగా చేస్తున్నామన్నారు. అలాగే, నియోజకవర్గంలోని ప్రతీ గ్రామం, పట్టణం వద్ద నాయకులతో, కార్యకర్తలతో సదస్సులు నిర్వహిస్తామన్నారు. ప్రతి వర్గానికి సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం లక్ష్యమని, ప్రతి దశలో పర్యవేక్షణ, తనిఖీల ద్వారా కులగణన లక్ష్యాలకు అనుగుణంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరుగుతుందన్నారు.

## ఏపీజీవీబీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు హనుమకొండ హెడ్ ఆఫీస్ ఏపీజీవీబీ బ్యాంకు ఆధ్వర్యంలో విజిలెన్స్ అవగాహన వారోత్సవ ర్యాలీని శనివారం నిర్వహించడం జరిగింది. కల్చరల్ అఫ్ ఇంటిగ్రిటీ ఫర్ నేషన్స్ ప్రొస్పెరిటీ అనే కాన్సెప్ట్ తో ర్యాలీని నిర్వహించారు. ఏపీజీవీబీ బ్రాంచ్ మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## జోరుగా బీజేపీ సభ్యత్వ నమోదు



**వరంగల్ వాయిస్, దామెర :** ప్రతి ఒక్కరూ సభ్యత్వ నమోదులో ఉత్సాహంగా పాల్గొనాలని పార్టీ సభ్యత్వాలను నమోదు చేయిస్తున్న బీజేపీ మండల అధ్యక్షుడు నాగరాజు అన్నారు. దామెర గ్రామంలో శనివారం నిర్వహిచిన బీజేపీ సభ్యత్వ నమోదులో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో యువమోర్చా మండల అధ్యక్షుడు గుట్ట రమేష్, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు పగడాల మధుకర్, శక్తి కేంద్ర ఇంచార్జి, యువ మోర్చా సీనియర్ నాయకులు సూరచందర్, గండు పరిసరం, సభ్యత్వ సహ ప్రముఖు ముఖేష్ గౌడ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహా ధర్నా పోస్టర్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఈ నెల 5న జరిగే మహా ధర్నా నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయండని మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ కోరారు. ఆటో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శనివారం బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆటో కార్మికుల మహా ధర్నా పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు జనార్ధన్ గౌడ్, పులి రజినీకాంత్, ఆటో యూనియన్ నాయకులు సంజీవ, బాబు, జయరాం, స్వామి, కుమారస్వామి, శ్రీధర్ రెడ్డి, వెంకన్న, రమేష్, దేవేందర్, సాయిలు, శివ పాల్గొన్నారు.

# కులగణనకు బీసీ సంఘం పూర్తి మద్దతు

### బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ గౌడ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బీసీ కులగణన గూర్చి ప్రజల అభిప్రాయ సేకరణ నిమిత్తం హనుమకొండ, వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమటి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో హనుమకొండ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ, బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణు గోపాల్ గౌడ్, వరంగల్ ఉమ్మడి జిల్లా బీసీల పక్షాన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బైరి రవికృష్ణ బీసీల సమస్యలపైన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం వచ్చి 77 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ బీసీలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో తీవ్ర అన్యాయం జరుగుతూనే ఉందన్నారు. దేశవ్యాప్తంగా అనేక బీసీ సంఘాలు బీసీ కులగణన చేపట్టి వారి జనాభా ప్రకారం ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో సమాన వాటా కల్పించాలని అనేక సంవత్సరాలుగా బీసీ సంఘాలు ఉద్యమాలు చేస్తున్న కేంద్రంలో అధికారంలో ఉన్న ఏ రాజకీయ పార్టీ కూడా బీసీల విన్నపాన్ని పట్టించుకోవడం లేదన్నారు. గత సంవత్సరం తెలంగాణ రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో, ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం గెలిస్తే బీసీల కులగణన చేపట్టి స్థానిక సంస్థల 42శాతం రిజర్వేషన్లు ఇస్తామని కామారెడ్డి బీసీ డిక్లరేషన్ సభలో స్వయంగా ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ప్రకటించడం జరిగింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కామారెడ్డి డిక్లరేషన్ లో ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీ కులగణన కోసం జీవో నెంబర్ 18 ఇచ్చి 3 నెలలో బీసీ కులగణన చేపట్టి స్థానిక సంస్థల ఎన్నికలో 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని ప్రకటించడం పట్ల ఈ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నాయిని రాజేందర్ రెడ్డికి వినతి పత్రం ద్వారా, త్వరగా కుల గణన పూర్తి చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని, చట్టసభల్లో 50శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని, రాష్ట్ర బడ్జెట్ లో బీసీలకు 50 శాతం నిధులు ఇవ్వాలని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నుంచి బీసీలను మినహాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బచ్చు ఆనందం, బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్ల సంపత్ కుమార్, బీసీ విద్యార్థి సంఘం కాకతీయ యూనివర్సిటీ ఇంచార్జి ఆరగంటి నాగరాజ్, బీసీ నాయకులు చిప్ప వెంకటేశ్వర్లు, అనుమాండ్ల విద్యాసాగర్, పంజాల మధు, కాశెట్టి రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

# కులగణనపై ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయి

### ● ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రనాయక్

**వరంగల్ వాయిస్, మరిపెడ :** కులగణనపై ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రనాయక్ విమర్శించారు. శనివారం మరిపెడలో కుల గణనపై విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ఎమ్మెల్యే డా.భూక్యా మురళీ నాయక్, డీసీసీ అధ్యక్షుడు భరత్ చందర్ రెడ్డి, డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రనాయక్ లు పాల్గొన్నారు. నిర్దిష్ట ప్రాంతం లేదా దేశంలోని వివిధ కుల సమూహాల పంపిణీపై సమగ్ర డేటాను సేకరించడం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. దేశంలోనే తొలిసారిగా తెలంగాణ రాష్ట్రంలో కులగణన చేపట్టనున్నట్లు తెలిపారు. తెలంగాణలో నవంబర్ 6 నుంచి కులగణన ప్రక్రియను ప్రారంభించనున్నారు. కుల గణనతో బీసీల్లో పెనుమార్పులు రాబోతున్నాయని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ, హైకోర్టు ఉత్తర్వుల మేరకే కులగణన చేస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. స్థానిక సంస్థలు, ఇతర రంగాల రిజర్వేషన్లపై ఆలోచన చేస్తున్నామని, డిసెంబర్ లో సర్వే నివేదికను ప్రభుత్వం ముందు ఉంచుతామన్నారు. నవంబర్ 6 నుంచి 30 వరకు రాష్ట్రవ్యాప్తంగా కులగణన జరగనుంది. ఇందు కోసం 75



ప్రశ్నలను సిద్ధం చేశారన్నారు. కుటుంబసభ్యుల పేర్లు, మతం, కులం, వయసు, మాతృభాష, మొబైల్, రేషన్ కార్డు నంబర్, విద్య, ఉద్యోగం, వృత్తి, ఆదాయం, భూములు, ఇల్లు, రిజర్వేషన్ ప్రయోజనాలు, వలసలు, ఐదేళ్ల నుంచి తీసుకున్న లోన్ల గురించి ఇన్ఫర్మేషన్ అడుగుతారు. ఎలాంటి ఫొటోలు, డాక్యుమెంట్లు తీసుకోరన్నారు. సర్వే టైంలో కుటుంబ యజమాని ఒకరు ఉంటే సరిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు యూగేందర్ రెడ్డి, ఆయా మండలాల అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు, మాజీ జడ్పీటీసీ, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్, వార్డ్ మెంబర్లు, గ్రామ అధ్యక్షులు, జిల్లా నాయకులు, మండల నాయకులు, గ్రామ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మరోసారి ఎమ్మెల్సీగా నర్సిరెడ్డిని గెలిపించాలి



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** ఉపాధ్యాయ, అధ్యాపక సమాజం సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తూ నిబద్ధత కలిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డిని మరోసారి గెలిపించుకుందామని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి విజ్ఞప్తి చేశారు. శాసనమండలి సమయాన్ని సంపూర్ణంగా సద్వినియోగం చేసుకున్న ఏకైక ప్రతినిధి నర్సిరెడ్డి అని గుర్తు చేశారు. ఉపాధ్యాయుల, అధ్యాపకుల పక్షపాతిగా పేద విద్యార్థుల అభ్యున్నతికి పాటుపడే ప్రజా నాయకుడిగా ఎన్నో సమస్యలపై శాసనమండలిలో తమ వాయిస్ ను ఫోకస్ చేసి ప్రభుత్వాన్ని నిలదీసిన ఏకైక ఎమ్మెల్సీ అని కొనియాడారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను పరిరక్షించుకోవడంలో మనమంతా కృషి చేయాలని, అందుకు ఎమ్మెల్సీ నర్సిరెడ్డిని రెండోసారి గెలిపించుకొని బీదాసాధలకు ఆసరాగా ఉన్న ప్రభుత్వ బడుల పరిరక్షణకై పోరాడాలని ఉపాధ్యాయులకు విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయుని ఉపాధ్యాయులంతా నవంబర్ 6లోపు తమ ఓటును నమోదు చేసుకొని నర్సిరెడ్డికి మొదటి ఓటును ఇచ్చి గెలిపించుకోవాలని యూటీఎఫ్ పక్షాన విజ్ఞప్తి చేశారు. నిరంతరం పోరాటాల ద్వారానే ఉపాధ్యాయుల అధ్యాపకుల సమస్యలు పరిష్కారమవుతూ వచ్చాయని, ఇప్పటి వరకు సమస్యల పరిష్కార సాధనకే కృషి చేస్తున్న యూటీఎఫ్ అపరిచితంగా ఉన్న సమస్యల పట్ల కూడా ఉపాధ్యాయ ఉద్యోగుల నందరిని ఏకం చేసి సమస్య ఉద్యమాలకు రూపకల్పన చేస్తున్నదని వివరించారు. శనివారం ఖిల్లా వరంగల్ ట్రైబల్ పాఠశాల, కాలేజ్, యాకుబ్ పురా సందర్శించి ఉపాధ్యాయుల ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు తాటికాయల కుమార్, ప్రధాన కార్యదర్శి సుజన్ ప్రసాద రావు, కోశాధికారి ఎండీ రవూఫ్, జిల్లా కార్యదర్శి కందగట్ల రమేష్, మండల బాధ్యులు బి.శ్రీనివాస్, చిలువేరు హరి ప్రసాద్, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# శంకుస్థాపన శిలాఫలకాలు మార్చుతారా..?

## ● ఎమ్మెల్యే తీరుపై బీఆర్ఎస్ మండిపాటు



**వరంగల్ వాయిస్, దామెర :** మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి మంజూరు చేయించిన నిధులను మేము తీసుకొచ్చామని చెప్పుకోవడం సిగ్గుచేటని బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. ఒక అధికారిక శిలాఫలకం ఉండగా మరొకటి ఏర్పాటు చేయటం వల్ల అప్పటి.ప్రభుత్వాన్ని, అప్పటి ప్రజాప్రతినిధులను అగౌరవ పరిచినట్లవుతుందన్నారు. దీనికి అధికారులు బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. దామెర మండలం సింగరాజుపల్లి గ్రామం నుంచి హరిచంద్ర నాయక్ తండా వరకు అప్పటి ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సింగరాజుపల్లి, వెంకటాపూర్, ల్యాదెల్ల, హరిచంద్ర నాయక్ తండా గ్రామాల రైతుల కోరిక మేరకు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ను ఒప్పించి జీఓ నెంబర్ 244, తేదీ 5-09-2023న ఎస్టీ ఎస్ డీఎఫ్ గ్రాంటు కింద రూ.304.00 మూడు కోట్ల నాలుగు లక్షల నిధులు మంజూరు చేయించారు. అప్పటి అధికారులు, ప్రజలు, అప్పటి ప్రజా ప్రతినిధుల సమక్షంలో 02అక్టోబర్ 2023జున శంకుస్థాపన చేసి శిలాఫలకం ఏర్పాటు చేశారు. కానీ, కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి కొత్తగా నిధులు మంజూరు చేయించకుండా అదనపు పనులు తీసుకోరాకుండా పాత పనికే మళ్లీ శంకుస్థాపన చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఇదీ గారడీ మాటలతో ప్రజలను మోసం చేయటం అవుతుందని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో దామెర మండలపార్టీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# మాజీ ఎమ్మెల్యేకు దీపావళి శుభాకాంక్షలు తెలిపిన శివ సంతోష్



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** నగరంలోని 20వ డివిజన్ చెందిన బీఆర్ఎస్ నాయకుడు చిమ్మని శివ సంతోష్ వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ కు దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. శివ సంతోష్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ బలపడాలని వారు తెలిపారు.

# ఫొటో గ్రాఫర్ తడండ్ల శ్రావణ్ కు స్వర్ణ పతకం



**వరంగల్ వాయిస్, ములుగు :** ప్రపంచ ఫోటో జర్నలిజం దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రముఖ ఫొటో గ్రాఫర్ ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామానికి చెందిన తడండ్ల శ్రావణ్ స్వర్ణ పతకంతో పాటు నగదు పురస్కారాన్ని అందుకున్నారు. ఇండియా ఇంటర్నేషనల్ ఫొటోగ్రాఫిక్ కౌన్సిల్, ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడలోని బాలోత్సవ్ భవన్ లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె మన్మధరావు, అవనిగడ్డ ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు చేతుల మీదుగా ఏపీ రహీం మెమోరియల్ అవార్డు అందుకున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి దాదాపు 500 మంది ఫొటో గ్రఫర్లు పాల్గొనగా ఫెస్టివ్ (తెలుగు పండుగలు) కేటగిరీలో అవార్డు వరించింది. ఖైరతాబాద్ మహా గణపతి శోభాయాత్రపై తీసిన తన ఫొటో ఉత్తమ చిత్రంగా ఎంపికైంది. ఈ సందర్భంగా తడండ్ల శ్రావణ్ మాట్లాడుతూ అవార్డు రావడం సంతోషంగా ఉందని, సమాజాన్ని ఆలోచింపజేసే, భారత సంస్కృతి ప్రతిబింబించే చిత్రాలను మరెన్నో తీస్తానని ఈ సందర్భంగా పేర్కొన్నారు.



# ఆర్టీఏ ఆఫీసులో ఏజెంట్లు లేకుండానే పని

## రాష్ట్రపతి అవార్డు గ్రహీత పరికిపండ్ల వేణు



**వరంగల్ వాయిస్, భీమారం:** హనుమకొండ ఆర్టీఏ ఆఫీసులో ఏజెంట్ అవసరం లేకుండానే పని జరిగినందుకు సంతోషం వ్యక్తపరిచాడు రాష్ట్రపతి అవార్డు గ్రహీత పరికిపండ్ల వేణు. ఇటీవల నూతన కారు కొనుగోలు చేసిన సందర్భంగా షోరూం వారు అన్ని కాగితాలు తయారుచేసి ఇస్తూ ఎవరైనా ఏజెంట్ ద్వారా మాత్రమే రిజిస్ట్రేషన్ ఆఫీస్ కు వెళ్లండని సూచించారు. వినియోగదారుల ఉద్యమకారుడైన వేణు ఏజెంట్ల ద్వారా పని చేయించుకోవడం ఇష్టం లేక నేరుగా ఆన్ లైన్ లో స్లాట్ బుకింగ్ చేసుకొని వాహన రిజిస్ట్రేషన్ కోసం ప్రయత్నం చేసి చూద్దామనుకొని ప్రయత్నించారు. ఏజెంట్ తో అవసరం లేకుండా పని అయినందుకు ప్రభుత్వానికి, హనుమకొండ ఆర్టీఏ అధికారులకు, సిబ్బందికి ధన్యవాదాలు తెలుపుతూ ప్రభుత్వం ఎప్పటి నుంచో ఏజెంట్లు లేకుండా ఆర్టీఏ ఆఫీసులలో పనులు జరగాలని నిబంధనలలో మార్పులు చేసుకుంటూ రావడం, అది నేటికీ అమలులోకి రావడం చాలా సంతోషించదగ్గ విషయం అన్నారు.

# ఘనంగా సీపీఐ శతజయంతి ఉత్సవాలను నిర్వహించండి

## కమ్యూనిస్టులదే భవిష్యత్తు
## స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి
## సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి




**వరంగల్ వాయిస్, వరంగల్ :** సీపీఐ ఆవిర్భవించి వందేళ్లు పూర్తి కావస్తున్న సందర్భంగా పార్టీ శతజయంతి ఉత్సవాలను గ్రామ గ్రామాన ఘనంగా నిర్వహించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస రావు కోరారు. శుక్రవారం భారత కమ్యూనిస్టు పార్టీ వరంగల్ జిల్లా కౌన్సిల్ సమావేశం దామెర కృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి వంద సంవత్సరాలు కావస్తున్న సందర్భంగా దేశంలో గ్రామ, గ్రామాన, వాడవాడలా ఘనంగా నిర్వహించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. వంద సంవత్సరాల ఘన చరిత్ర గలగిన పార్టీ దేశంలో భారత కమ్యూనిస్టు పార్టీ ఒక్కటే అన్నారు. దేశంలో వంద సంవత్సరాల నుంచి ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని పేద ప్రజల కోసం పోరాడుతుందన్నారు. పెట్టుబడిదారీలకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలు చేపట్టిన పార్టీ సీపీఐ మాత్రమే నని అన్నారు. రానున్న రోజులు కమ్యూనిస్టులదే భవిష్యత్తు అన్నారు. వెనిజులా, శ్రీలంకలో మాదిరిగా భారతదేశంలో కమ్యూనిస్టులు అధికారంలోకి రావడం తధ్యమని చెప్పారు. దేశంలో జమిలి ఎన్నికల మాట వినిపిస్తుందని, ఇది కేవలం పెట్టుబడిదారుల కోసమే ప్రధాని మోడీ జమిలి ఎన్నికలు తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నాడన్నారు. కానీ, దేశంలో ఇది సాధ్యం కాదన్నారు. రాష్ట్రాల హక్కులను హరించడానికి దేశంలో బీజేపీ ఒకటే ఉండాలని ఎంత ప్రయత్నం చేసినా రానున్న రోజుల్లో ఆ పార్టీకి ప్రజలు బుద్ధి చెపుతారని చెప్పారు. మొన్న జరిగిన ఎన్నికల్లో బీజేపీకి కొంత బుద్ధి చెప్పారని, రానున్న కాలంలో తగిన బుద్ధి చెబుతారని అన్నారు. హర్యానా ఎన్నికల్లో కేవలం 0.5 శాతం ఓట్లతోనే బీజేపీ అధికారంలోకి వచ్చిందని, అది బీజపీ గెలుపు కాదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేసి ప్రజల కోసం పని చేయాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ సత్తా చాటాలని, కార్యకర్తల్లో జోష్ నింపారు. ప్రజల కోసం పనిచేసే కమ్యూనిస్టుల వైపు ప్రజలు ఉన్నారని, స్థానిక సంస్థల్లో సీపీఐ అభ్యర్థులకు అవకాశం ఇచ్చేందుకు ప్రజలు చూస్తున్నారన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పంజాల రమేష్, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ కే బాష్, పనస ప్రసాద్, దండు లక్ష్మణ్ బుస్సా రవీందర్, గుండే బద్రి, తోట చంద్రకళ, తల్లాపెల్లి రాహెల, కందిక చెన్నకేశవులు, గన్నారపు రమేష్ శరత్, తదితరులు పాల్గొన్నారు.

# లైబ్రరీల అభివృద్ధికి పాటుపడుతా




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కాకతీయ యూనివర్సిటీ రాజనీతి శాస్త్ర విభాగానికి శనివారం రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ డాక్టర్ రియాజ్ విచ్చేశారు. ఈ సందర్భంగా రియాజ్ మాట్లాడుతూ రాజనీతి శాస్త్ర అకాడమిక్, అల్యూమిని హాల్ అభివృద్ధికి ఎల్లవేళలా తన వంతు సహకారం ఉంటుందని తెలిపారు. రాజనీతి శాస్త్ర విద్యార్థులు దేశానికి ఆదర్శంగా ఉంటూ నూతన రాజకీయ ఒరవడి తీసుకురావాలని తెలియజేశారు. కాంపిటీటివ్ ఎగ్జామ్స్ కానీ, లాంగ్వేజ్ స్కిల్స్, ఇంకా ఎలాంటి ఇబ్బందులు ఉన్న విద్యార్థులకు అందుబాటులో ఉండి రాజనీతి శాస్త్ర విభాగంలో లైబ్రరీ అభివృద్ధితో పాటు యూనివర్సిటీలో ఉన్న సెంట్రల్ లైబ్రరీ అభివృద్ధికి అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ సంకినేని వెంకట్ హెచ్ఓడీ, డాక్టర్ గడ్డం కృష్ణయ్య బీఓఎస్, డాక్టర్ వి.సత్యనారాయణ అసిస్టెంట్ ప్రొఫెసర్, డాక్టర్ వి.నాగరాజు అసిస్టెంట్ ప్రొఫెసర్, రీసెర్చ్ స్కాలర్స్ అంకిల్ల శంకర్, కల్లెపల్లి ప్రశాంత్, సురేష్, రుబీనా, వినోద్, సతీష్, నరేష్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి మనిషికి వృద్ధాప్యం సహజం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రామన్నపేటలోని డాక్టర్.ఏ.రాజేంద్రప్రసాద్ భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని కాజీపేట సెంటెన్స్ హోం ఫర్ డిసేబుల్ అండ్ అంగవికుల్ రా ఆశ్రమంలో దీపావళి సందర్భంగా వృద్ధులకు కాకర వత్తులు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా మెనీ ఇంట్రెస్ట్ మాట్లాడుతూ వృద్ధాప్యం అనేది ప్రతి మనిషికి స్వాగతం అన్నారు. అలాగే ప్రతి మనిషి కౌమారము, యవ్వనం, వృద్ధత్వము సహజమన్నారు. వృద్ధులని హేయ భావంతో చూడకుండా ప్రేమతో, ఆప్యాయంతో దరి చేర్చుకోవాలన్నారు. వారి గతంలో జరిగిన సంఘటనలను, అనుభవాలను నేర్చుకొని ముందుకు సాగాలన్నారు. వారి అనుభవాలు భావితరాల వారికి అవసరమన్నారు. ఈ సందర్భంగా సిస్టర్ నిర్మల మాట్లాడుతూ మీ ట్రస్ట్ ద్వారా వచ్చి వృద్ధులలో ఆత్మవిశ్వాసం పెంచడం చాలా సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ ట్రస్ట్ డాక్టర్ ఇంచార్జి సిస్టర్ నిర్మల, ఆర్గనైజర్ శ్రవణ్, కోఆర్డినేటర్ మోహన్ వారణాసి వృద్ధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# స్వామివారిని దర్శించుకున్న మనోహర్ రావు దంపతులు



**వరంగల్ వాయిస్, రేగొండ :** మండలంలోని కొడవటంచ గ్రామంలోని సుప్రసిద్ధ శ్రీ కొడవటంచ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలోని లక్ష్మీ నరసింహ స్వామిని శనివారం జిల్లా కాంగ్రెస్ నాయకులు, ఆరే హక్కుల పోరాట సమితి నాయకులు భలే రావు మనోహర్ రావు–పద్మ దంపతులు స్వామివారి దర్శించుకున్నారు. ఆలయంలో శనివారం నుంచి కార్తీక మాస ప్రత్యేక సామూహిక దిపోత్సవంలో పాల్గొనేందుకు ఆలయానికి చేరుకున్న మనోహర్రావు దంపతులు ముందుగా స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం వారు లక్ష్మీ నరసింహ సన్నిధిలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, కార్తీక సామూహిక దీపోత్సవ కార్యక్రమంలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మనోహర్ రావు దంపతులు స్వామివారిని దర్శించుకోని మండల ప్రజలతో పాటు రైతులకు వర్షాలు పడి పంటలు బాగా పండి సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు పేర్కొన్నారు..

# 4న మాదిగ ఆత్మీయ సమ్మేళన సభ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** చింతగట్టులోని కేఎల్ఎన్ గార్డెన్ లో ఈ నెల 4న జరిగే మాదిగ ఆత్మీయ సమ్మేళన సభను విజయవంతం చేయాలని మాదిగ విద్యార్థుల వేదిక కేయూ నాయకుడు డా.మంద వీరస్వామి అన్నారు. కాకతీయ యూనివర్సిటీలో ఏర్పాటు చేసుకున్న ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ అత్యున్నత న్యాయస్థానం అయిన సుప్రీంకోర్టు గత ఆగస్టు నెల 1న ఎస్సీలలో ఏబీసీడీ వర్గీకరణ జరపాలని తీర్పు ఇచ్చిందని, దానిని అమలు జరపకుండా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్లక్ష్యం చేస్తున్నారని, వెంటనే సుప్రీంకోర్టు తీర్పును అమలు పరచాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల కోసం ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకురావడానికి ఈనెల 4న చింతగట్టులోని కేఎల్ఎన్ వేడుకల మందిరంలో జరిగే మాదిగ ఆత్మీయ సమ్మేళన సభకు పెద్ద ఎత్తున విద్యార్థులు, డాక్టర్లు, లాయర్లు, ప్రొఫెసర్లు, మేధావులు పెద్ద ఎత్తున హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాదిగ విద్యార్థుల వేదిక నాయకులు డా.పాలమాకుల కొమురయ్య, ఆకులపెల్లి కుమారస్వామి, అలువాల కార్తీక్, అరూరి రంజిత్, ఒడ్డెపెల్లి మధు, బొట్ల మనోహర్, అంబాల కిరణ్, కేతపాక ప్రసాద్, మసాని ప్రదీప్, దుపాకి కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# విప్లవకారుల ప్రాణ త్యాగాలు వెలకట్టలేనివి

- సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ వరంగల్ జిల్లా కార్యదర్శి చిర్ర సూరి




**వరంగల్ వాయిస్, నర్సంపేట :** భూమి, భుక్తి, విముక్తి కోసం కొనసాగిన భారత విప్లవ ఉద్యమంలో తమ అమూల్యమైన ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన విప్లవకారుల ప్రాణత్యాగాలు వెలకట్టలేనివని, ప్రజలంతా శ్రామిక రాజ్య స్థాపనే ధ్యేయంగా విప్లవోద్యమంలో భాగస్వాములు కావాలని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజా పంథా) వరంగల్ జిల్లా కార్యదర్శి చిర్ర సూరి పిలుపునిచ్చారు. సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నవంబర్ 1 నుంచి 9 వరకు విప్లవోద్యమంలో అమరులైన వీరుల స్మారక వారోత్సవాలను పురస్కరించుకుని శనివారం ఖిలా వరంగల్, శివనగర్, నర్సంపేట, ఖానాపురం మండలం అశోక్ నగర్ కేంద్రాల్లో ఎర్రజెండాలు ఎగురవేసి అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా చిర్ర సూరి మాట్లాడుతూ దేశంలో 78 సంవత్సరాల పార్లమెంటరీ పాలనలో ప్రభుత్వాలు ప్రజల కనీస మౌలిక సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యాయని తెలిపారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న సామ్రాజ్యవాద పెట్టుబడిదారి విధానాల వలన దేశంలో పేదరికం, నిరుద్యోగం, కుల, మత, ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నాయని అన్నారు. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం పౌరుల ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తూ, భిన్నత్వంలో ఏకత్వ స్ఫూర్తిని దెబ్బతీస్తూ, దేశ లౌకిక వ్యవస్థను విచ్ఛిన్నం చేస్తూ, దేశాన్ని మతోన్మాద ఫాసిజం వైపు తీసుకెళ్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాలను విమర్శించే ప్రజాస్వామిక వాదులను, కమ్యూనిస్టు విప్లవకారులను "ఉపా"లాంటి నల్లచట్టా పేరిటా అక్రమ నిర్బంధాలకు, తీవ్ర అణచివేత చర్యలకు పాల్పడుతున్నాడని తీవ్రంగా ఆక్షేపించారు. ఏజెన్సీలోని ఆదివాసి, గిరిజనులను అణచివేసే ఆపరేషన్ కుమార్ ను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిందని, ప్రభుత్వాలు మారిన ప్రజల తలరాతలు మారటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో నాటుకుపోయిన భూస్వామ్య అవశేషాలను, నేటి పెట్టుబడిదారి వ్యవస్థను కూకటివేళ్లతో పెకలించి వేసి, నూతన ప్రజాస్వామిక విప్లవమే ధ్యేయంగా అమరవీరుల స్ఫూర్తితో ప్రజలంతా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ వరంగల్ జిల్లా నాయకులు మైదం పాణి, అర్షం అశోక్, అడ్డూరి రాజు, పీడీఎస్ యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.నరసింహారావు, అంకుష్, స్వామి, ధార లింగన్న, కత్తుల కొమురయ్య, గట్టు కొప్పుల రవి, జవహర్ లాల్, మనోహర చారి, వీరా రెడ్డి, సాంబయ్య, మురళి, అమర్, లక్ష్మి, చంటి, ప్రభాకర్, సుదర్శన్, రాజశేఖర్, ఉల్లంగుల సారంగం, వెంకన్న, మధు తదితరులు పాల్గొన్నారు.

# విస్తృతంగా జన విజ్ఞాన సభ్యత్వ నమోదు



**వరంగల్ వాయిస్, మరిపెడ :** స్థానిక మునిసిపల్ కేంద్రంలో విస్తృతంగా జన విజ్ఞాన వేదిక సభ్యత్వ నమోదు కార్యక్రమం జన విజ్ఞాన వేదిక మండల అధ్యక్షుడు బయగాని రామ్మోహన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో మూఢ నమ్మకాలు పారద్రోలాలని అన్నారు. ప్రతి ఒక్కరూ మూఢనమ్మకాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. మంత్రాలు, చేత బడులు వంటివి గ్రామాల్లో ప్రజలు నమ్మొద్దని సూచించారు. మండలంలో శనివారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. మండల తహసీల్దార్ సైదులు, మున్సిపల్ కమిషనర్ నరేష్ రెడ్డి, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ అక్తర్, సీతారాంపురం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామచంద్రు, మరిపెడ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనంతరావు జడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయ బృందానికి సభ్యత్వాలను అందించడం జరిగిందని మండల అధ్యక్షుడు రామ్మోహన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక ఉపాధ్యక్షుడు జనార్ధనా చారి, చెకుముకి కన్వీనర్ సుభాన్, కోశాధికారి లాల్ చంద్, పర్యావరణ కన్వీనర్ మంగు, సామాజిక న్యాయం విభాగం శ్రీశైలం, సమతా కన్వీనర్ రాజకుమారి, కార్యదర్శి స్వప్న, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీకి న్యాక్ బి గ్రేడ్

- ప్రిన్సిపల్ డాక్టర్ రాధిక




**వరంగల్ వాయిస్, ములుగు :** ములుగు తెలంగాణ గిరిజన మహిళ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలకు న్యాక్ (నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్) బి గ్రేడ్ ప్రకటించిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.రాధిక శనివారం తెలియజేశారు. బి గ్రేడ్ రావడం వల్ల కళాశాల మరింత అభివృద్ధి చెంది విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడానికి దోహదపడుతుందన్నారు. గత నెలలో న్యాక్ పీర్ బృందం అక్టోబర్ 23, 24 తేదీలలో కళాశాలను పరిశీలించిందని, వారు అందించిన నివేదికతో పాటు కళాశాలలో ఉత్తమమైన బోధన, పరిసరాల పరిశుభ్రత, ఇతర అనుకూలతలను పరిగణలోకి తీసుకొని మన కళాశాలకు బి గ్రేడ్ ని ఇవ్వడం సంతోషకరమన్నారు. న్యాక్ బృందం వారు కళాశాలలో అందుతున్న సదుపాయాలు, బోధన పద్ధతులు అవలంబిస్తున్న విధానాలను పరిశీలించిందని తెలిపారు. అదే విధంగా విద్య ప్రమాణాలు ఎలా ఉన్నాయని అధ్యయనం చేశారు. నాణ్యత ప్రమాణాల ఆధారంగా గ్రేడ్లు కేటాయించేందుకు నివేదికను సీల్డ్ కవర్ లో బెంగళూరులోని న్యాక్ ప్రాంతీయ కా ర్యా ల యా ని కి పంపారని ప్రిన్సిపాల్ తెలియజేశారు. న్యాక్ బృందంలో ప్రొఫెసర్ వెంకట చలపతి వైస్ ఛాన్సలర్ కర్పగం అకాడమీ ఆఫ్ హైయర్ ఎడ్యుకేషన్ తమిళనాడు, మెంబర్ కోఆర్డినేటర్ గా డాక్టర్ నారాయణ ప్రసాద్ ప్రొఫెసర్ ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ న్యూ ఢిల్లీ అదే విధంగా మెంబర్ గా డాక్టర్ సుధాకర్ ప్రిన్సిపల్ షేత్ జే ఎన్ పాలివాల కాలేజ్ పల్లి రాయగడ్ మహారాష్ట్రకు చెందినవారు ఆ బృందంలో ఉన్నట్లు తెలియజేశారు. వారికి ప్రిన్సిపల్ డాక్టర్ రాధిక గత ఐదేళ్లలో నిర్వహించిన ముఖ్యమైన కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కళాశాల నాణ్యత ప్రమాణాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ రాధిక మాట్లాడుతూ కళాశాల మరింత అభివృద్ధి చెందే అవకాశాలు మెండుగా ఉన్నాయని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. న్యాక్ బృందం వారు కళాశాలలోని వివిధ రకాలైన డిపార్ట్ మెంట్స్ అన్నింటిని తనిఖీ చేయడం జరిగింది. ఈ బృందం వారు విద్యార్థుల నాణ్యత ప్రమాణాలు, వారి గ్రేడ్లు, వారి రిజల్ట్ పర్సంటేజ్ ని అదే విధంగా కాలేజీ రికార్డ్స్ ను, మెయింటెనెన్స్ పద్ధతులను, కాలేజ్ వాతావరణాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ల్యాబ్స్ కూడా పరిశీలించారు. అదేవిధంగా విద్యార్థులతో, విద్యార్థుల తల్లిదండ్రులతో, పూర్వ విద్యార్థులతో, కళాశాల ఉద్యోగులతో, వివిధ రకాల విభాగాల అధికారులతో సమావేశమయ్యారు. పై అంశాలను అన్నింటినీ పరిగణలోకి తీసుకొని నాకు బృందం బి గ్రేడ్ ని ఇవ్వడం సంతోషకరమైన విషయమన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతరులు పాల్గొన్నారు.

వరంగల్ వాయిస్
సినిమా
శనివారం 02
నవంబర్ 2024
7

# అది చూసి అసహనానికి ..

## పోస్టర్ ఎడిట్‌పై మృణాల్ ఠాకూర్ మండిపాటు

'ది ఫ్యామిలీ స్టార్' సినిమా పోస్టర్‌ను ఎడిట్ చేసిన ఓ నెటిజన్‌పై హీరోయిన్ మృణాల్ ఠాకూర్ మండిపడ్డారు. అతను చేసిన పని ఏమాత్రం నచ్చలేదన్నారు. ఇంతకీ నెటిజన్ ఏం చేశాడంటే.. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని సౌఖిన్ అనే వ్యక్తి ఇన్‌స్టా వేదికగా ఓ ఫొటో షేర్ చేశాడు. గత ఏడాది దీపావళికి సంబంధించిన 'ది ఫ్యామిలీ స్టార్' పోస్టర్‌ను అతడు ఎడిట్ చేశాడు. విజయ్ దేవరకొండ స్థానంలో తన ఫొటోని పెట్టి.. మృణాల్‌తో కలిసి టపాసులు కాలుస్తున్నట్లు క్రియేట్ చేశాడు. "దీపావళి ఫొటో ఎడిటింగ్.. బాలీవుడ్ నటి ఫొటోషూట్" అని పేర్కొన్నాడు. ఇది కాస్త మృణాల్ కంట పడిరది. దీనిని చూసి ఆమె అసహనానికి గురయ్యారు. వెంటనే ఆ పోస్ట్‌కు రిప్లై ఇచ్చారు. "బ్రదర్.. మీకు మీరే ఎందుకు తప్పుడు భరోసా ఇచ్చుకుంటున్నారు? మీరు చేసిన పని బాగుందనుకుంటున్నారా? ఇది ఏమాత్రం బాలేదు" అని తెలిపారు. దీనిపై నెటిజన్లు స్పందిస్తూ అతడు చేసిన పనిని తప్పుబడుతున్నారు. విజయ్ దేవరకొండ, మృణాల్ ఠాకూర్ జంటగా నటించిన చిత్రం ' ది ఫ్యామిలీ స్టార్'. పరశురామ్ దర్శకత్వం వహించారు. శ్రీ వేంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్ రాజు నిర్మించారు. ఎన్నో అంచనాల మధ్య ఈ ఏడాది ఏప్రిల్ 5న ఈ సినిమా విడుదలైంది. అయితే ఆశించిన ఫలితం అందుకోలేకపోయింది. ప్రస్తుతం మృణాల్ ఠాకూర్ బాలీవుడ్‌లో వరుస చిత్రాలు చేస్తున్నారు. 'పూజా మేరీ జాన్', 'హై జవానీ తో ఇష్క్ హోనా హై', 'సన్ ఆఫ్ సర్దార్ 2', 'తుమ్ హీ హో' వంటి చిత్రాల్లో ఆమె నటిస్తున్నారు.



# ఆ సినిమాకు రెమ్యునేషన్ తీసుకోలేదు

టాలీవుడ్ సీనియర్ నటుడు జగపతిబాబుపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు ప్రముఖ నిర్మాత దిల్ రాజు. తన నిర్మాణంలో వచ్చిన ఒక సినిమాకు అసలు డబ్బులు తీసుకోకుండా నటించినట్లు తెలిపాడు. ప్రకాశ్‌రాజ్, త్రిష ప్రధాన పాత్రల్లో వచ్చిన చిత్రం ఆకాశమంతా. ఈ సినిమాను శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్‌పై దిల్ రాజు నిర్మించగా.. రాధ మోహన్ దర్శకత్వం వహించాడు. తండ్రికూతుళ్ల సెంటిమెంట్ నేపథ్యంలో వచ్చిన ఈ చిత్రం 2008లో విడుదలై మంచి విజయాన్ని అందుకుంది. అయితే రీసెంట్‌గా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న దిల్ రాజు ఈ సినిమాకు సంబంధించి ఒక ఆసక్తికర విషయాన్ని పంచుకున్నాడు. ఈ సినిమాకు జగపతిబాబు రెమ్యూనరేషన్ తీసుకోలేదని వెల్లడిరచాడు. ఈ మూవీ టైంలో ఒక పాత్ర ఉంది చేస్తారా అని జగపతిబాబును సంప్రదించాం.. అయితే ఈ పాత్ర నచ్చడంతో మూవీ ఒకే చెప్పాడు. అనంతరం రెమ్యూనరేషన్ టాపిక్ వస్తే.. ఫ్రీగా చేస్తాను అన్నాడు. దీంతో మేం అందరం షాక్ అయ్యాం. అయితే జగపతిబాబు మాట్లాడుతూ.. నాకు వేతనం వద్దు రాజు.. మంచి చిత్రంలో భాగం అవుతున్న అది చాలు అన్నాడు. దీంతో నా కళ్లల్లో నీళ్లు తిరిగాయి అంటూ రాజు చెప్పుకోచ్చాడు.



# రాక్షసుడిలా ప్రభాస్

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ఇప్పుడు వరుస సినిమాలతో బిజీగా ఉన్నాడు. రాజా సాబ్, స్పిరిట్, హను రాఘవపూడి సినిమా, సలార్ 2, కల్కి 2 ఇలా ఐదు సినిమాల భారీ లైనప్ తో ప్రభాస్ 2026 చివరి వరకు ఎవరికీ కొత్తగా చిక్కేలా కనిపించడం లేదు. మరోవైపు చిన్న సినిమాతో పాన్ ఇండియా వైడ్‌గా సూపర్ సక్సెస్ సాధించిన ఓ డైరెక్టర్ ఇప్పుడు ఆ సినిమాకి సీక్వెల్ సిద్ధం చేసుకుంటున్నాడు. ఆ తర్వాత ఈ డైరెక్టర్ ప్రభాస్‌ని ఒక నెగిటివ్ షేడ్‌లో చుపించాలనుకుంటున్నాడట. ఇంతకీ ఆ డైరెక్టర్ ఎవరంటే.. 'హనుమాన్' సినిమాతో పాన్ ఇండియా సక్సెస్ అందుకున్న దర్శకుడు ప్రశాంత్ వర్మ. ప్రస్తుతం 'జై హనుమాన్' తో పాటు 'ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్'లో పలు సినిమాలు చేస్తున్నాడు. గతంలో ప్రశాంత్ వర్మ 'బ్రహ్మ రాక్షస' పేరుతో ఒక స్క్రిప్ట్ రాసుకొని ఒక బాలీవుడ్ హీరోకి నేరేట్ చేశాడు. కానీ.. ఆ సినిమా ఆరంభంలోనే ఆగిపోయింది. ఇదే స్క్రిప్ట్ తో ప్రశాంత్.. ప్రభాస్ ని కాంటాక్ట్ అయినట్లు సమాచారం. దీనికి ప్రభాస్ కూడా సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. అన్ని సవ్యంగా జరిగితే 2027లో ఈ ప్రాజెక్ట్ ప్రారంభమయ్యే ఛాన్స్ ఉంది. ఇక ట్రూ పాన్–ఇండియా బ్లాక్‌బస్టర్ 'హనుమాన్' తర్వాత మోస్ట్ ఎవైటెడ్ సీక్వెల్ 'జై హనుమాన్' కోసం ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్‌తో చేతులు కలిపారు. ఈ ఎక్సయిటింగ్ న్యూ ప్రాజెక్ట్‌లో నేషనల్ అవార్డ్ విన్నర్ రిషబ్ శెట్టి లీడ్ రోల్ పోషించనున్నారు. ఈ కొలాబరేషన్‌లో 'జై హనుమాన్' స్వరూపమే మారిపోయింది. ఇక 'కాంతార' ఫేమ్ రిషబ్ శెట్టి ఈ సినిమాలో హనుమంతుడిగా చేస్తున్నట్లుగా ఇప్పటికే వార్తలు లీకయ్యాయి. మేకర్స్ దీవాళి స్పెషల్‌గా హనుమంతుడి పాత్రతో కూడిన ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు. హనుమంతుడిగా మొదటి నుండి వినిపిస్తున్న రిషబ్ శెట్టినే ఫైనల్ చేశారు.



# ఆ బెదిరింపులు నిజమే..!

అండర్ వరల్డ్ డాన్ దావుద్ ఇబ్రహీంని ఉద్దేశించి బాలీవుడ్ హీరో సల్మాన్‌ఖాన్ మాజీ ప్రేయసి సోమీ అలీమాట్లాడారు. అండర్‌వరల్డ్ నుంచి సల్మాన్‌కు గతంలో బెదిరింపులు వచ్చాయని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆమె చెప్పారు. ''నేను బాలీవుడ్‌లో వర్క్ చేసిన సమయంలో దావుద్ ఇబ్రహీం, చోటా షకీల్ గురించి చాలామంది నటీనటులు మాట్లాడుకోవడం విన్నాను. వీరిలో ఎవరూ ప్రత్యక్షంగా మాట్లాడుకునేవారు కాదు. 'అండర్ వరల్డ్' అని కోడ్ లాంగ్వేజ్‌లో మాట్లాడుకునేవారు. సల్మాన్‌తో కలిసి గ్యాలెక్సీ నివాసంలో ఉన్న సమయంలో ఆయనకు ఓసారి అండర్‌వరల్డ్ నుంచి బెదిరింపు కాల్ వచ్చింది. ఫోన్ ఎవరు చేశారో తెలియదు కానీ.. అతడు మాత్రం బెదిరింపులకు పాల్పడ్డాడు. 'సల్మాన్‌కు చెప్పు.. ఆయన ప్రియురాలిని మేము కిడ్నాప్ చేయనున్నామని'' అన్నారు. అతడి మాటలతో నాకెంతో భయం కలిగింది. వెంటనే ఆ విషయాన్ని సల్మాన్‌కు చెప్పాను. ఆయన కూడా కంగారుపడ్డారు. పరిస్థితులు చక్కబడేలా చేశారు. ఆ ఫోన్ చేసిన వ్యక్తి ఎవరో తెలుసుకుందామని ఎన్నోసార్లు ప్రయత్నించా. సల్మాన్‌నూ అడిగా. 'ఈ విషయాలకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిది' అని ఆయన చెప్పారు'' అని సోమీ అలీ తెలిపారు. సోమీ అలీ బాలీవుడ్‌లో 'ఆందోళన్', 'మాఫియా' వంటి చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్నారు. సల్మాన్‌ఖాన్ – సోమీ అలీ ప్రధాన పాత్రల్లో గతంలో ఓ చిత్రాన్ని ప్రకటించారు. చిత్రీకరణ దశలో ఉండగానే ఈ సినిమా ఆగిపోయింది.





# స్టూడెంట్స్ గెట్ అప్





- విద్యార్థులకు వేకప్ కాల్స్
- పదిలో ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యం
- తల్లిదండ్రుల్లా బాధ్యతలు తీసుకుంటున్న ఉపాధ్యాయులు

**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** ఎవరైనా తమ జీవితాలను మెరుగుపరచుకోవడానికి విద్య ఒక ఆయుధంగా పనిచేస్తుంది. అయితే పిల్లల చదువు ఇంట్లోనే ప్రారంభమవుతుంది. అక్కడే మంచి జీవితం కోసం బాటలు పడుతాయి. అదేవిధంగా విద్య జ్ఞానంతోపాటు వ్యక్తిత్వాన్ని, నైపుణ్యాలను మెరుగు పరుస్తుంది. ఉపాధి అవకాశాలను ప్రభావితం చేస్తుంది. అత్యంత ప్రామాణికమైన విద్యను విద్యార్థులకు సులభంగా, సునిషితంగా అందించేందుకు టీచర్లు తపన పడుతుంటారు. అయితే ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు ఉపాధ్యాయులు కష్టపడుతుంటారు. అందులో భాగంగానే పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు నూతన ఎఫెక్టివ్ పద్ధతులకు శ్రీకారం చుట్టారు. అందుకు 'వేకప్ కాల్స్' ఉపయోగకరంగా ఉంటాయని భావించి టీచర్లు అందుకు అనుగుణంగా బాటలు వేస్తున్నారు. విద్య చీకటిలో కాంతి కిరణంగా భావించే ఉపాధ్యాయులు సూర్యుడి తొలి కిరణం భూమిని తాకకముందే విద్యార్థిని నిద్ర లేపి పుస్తకంలో దాగిన విద్యను చదివించి ఉత్తేజ పరుస్తున్నారు.

### గతంలో మాదిరిదా..

గతంలో తల్లిదండ్రులు వేకువజామునే నిద్రలేచి తమ దైనందిన కార్యక్రమాలు పూర్తిచేసుకుని వ్యవసాయం, వ్యాపారం, ఇతర పనుల కోసం వెళ్లేవారు. ఆ సమయంలోనే పిల్లలను కూడా తమతో పాటే నిద్ర లేపి చదివించేవారు. ప్రస్తుతం ప్రజల జీవన శైలిలో మార్పులు వచ్చాయి. ఆలస్యంగా పడుకోవడం పొద్దు పొడిచే దాక నిద్ర లేవకపోవటం పరిపాటిగా మారింది. తల్లిదండ్రులే అలా ఉన్నప్పుడు పిల్లలను మేల్కొలిపే వారు ఎవరుంటారు. కొన్ని ఇళ్లల్లో తల్లిదండ్రులు నిద్రలేచినా పిల్లలను చదువుకోవడం కోసం లేపడం లేదు. వేకువ సమయంలో వాతావరణం ప్రశాంతంగా ఉంటుంది. రాత్రంతా విద్యార్థులు తగినంత విశ్రాంతి తీసుకున్నందున ఉదయం సమయంలో చదివినా, రాసిన వారి మనసులో నిక్షిప్తమైపోతుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు తల్లిదండ్రుల్లా బాధ్యతలను స్వీకరించారు. పదో తరుగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు మూడు నెలల ముందు నుంచి ఉదయం 5 గంటలకు టీచర్లు నిద్రలేస్తున్నారు. విద్యార్థులకు ఫోన్ చేసి నిద్రలేపి చదివిస్తున్నారు. విద్యార్థులపై జరుగుతున్న ఈ ప్రయోగం వల్ల విద్యా ప్రమాణాలు పెరిగి ఫలితాలు ఆశాజనకంగా మారాయి. ఉపాధ్యాయులు నేరుగా తల్లిదండ్రులతో మాట్లాడే క్రమంలో వారి సాధక, బాధకాలు, పిల్లల ప్రవర్తన, ఆరోగ్యం గురించి చర్చ జరుగుతుంది. ఫలితంగా ఆత్మీయత చోటు చేసుకోవటమే కాకుండా సానుకూల వాతావరణంతో విద్యా అవకాశాలు మెరుగవుతున్నాయి.

### వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం..

**బండి నర్సింహా రావు, హెచ్ఎం, జిల్లా పరిషత్ స్కూల్, డోర్నకల్**



మా పాఠశాలలో సమ్మేటివ్ అసెస్మెంట్–1 పరీక్ష ఫలితాలను సమీక్షించాం. పదో తరగతి ఫలితాలు ఆశా జనకంగా ఉండబోతున్నాయి. 100 శాతం ఉత్తీర్ణత సాధించడంతోపాటు 10, 9, 8 గ్రేడ్ పాయింట్స్ వచ్చేలా లక్ష్యంగా నిర్ణయించుకున్నాం. అందుకుగాను ప్రతి టీచర్ తన సబ్జెక్టుకు సంబంధించి యాక్షన్ ప్లాన్ రూపొందించుకున్నారు. దానిలో భాగంగా నవంబర్ నెల ప్రారంభం నుంచి తామ దత్తత తీసుకున్న విద్యార్థులకు రోజు ఐదు గంటలకే వేక్ అప్ కాల్స్ చేస్తున్నాం. దీనివల్ల విద్యార్థుల చదువు మెరుగవటంతో పాటు వారి తల్లిదండ్రులతో ఆత్మీయ సంబంధాలు బలపడుతున్నాయి. ఉపాధ్యాయుల్లో జవాబుదారి తనం మెరుగవుతుంది.



# ఢిల్లీలో పిల్లులు.. గల్లీలో విమర్శలు

- విమర్శించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**వరంగల్ వాయిస్, స్టేషన్ ఘన్ పూర్ :** కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి పథంలో దూసుకు వెళ్తుంటే బీఆర్ఎస్, బీజేపీలు పోటి పడి విమర్శలు చేస్తున్నాయని మండిపడారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్, కేంద్రంలో ఉన్న బీజేపీలు రాష్ట్రానికి చేసింది ఏమీ లేదన్నారు. బీజేపీ నేతలు ఢిల్లీలో పిల్లుల్లాగా వ్యవహరిస్తూ గల్లీలో విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. లింగాల ఘనపూర్ మండల కేంద్రంతోపాటు కళ్లెం, కుందారం గ్రామాల్లో పీఏసీఎస్, నెల్లుట్ల గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ముఖ్య అతిథిగా హాజరైన వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్యతో కలిసి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన బీఆర్ఎస్, బీజేపీలపై విమర్శలు గుప్పించారు. పసలేని, పనిచేయని రాజకీయ పార్టీలు కావాలని పని కట్టుకొని ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని అలాంటి వారి మాటలు నమ్మొద్దన్నారు. రాజకీయాలకు, గ్రూపులకు అతీతంగా నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేద్దామని ఎమ్మెల్యే కడియం శ్రీహరి పిలుపునిచ్చారు. రాష్ట్రంపై, ప్రజలపై బీజేపీ నాయకులకు ఏమాత్రం ప్రేమ ఉన్నా రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం నుంచి రూ.50 వేల కోట్లు తీసుకొచ్చి అప్పుడు మాట్లాడాలంటూ సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని గ్రేడ్ వన్ వడ్లకు రూ.2,320, సాధారణ వడ్లకు రూ.2,300, సన్న వడ్లకు రూ.500 బోనస్ గా చెల్లించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ బ్యాంకుల వద్ద రూ.25 వేల కోట్లు తీసుకువచ్చి ధాన్యం కొనుగోలు చేస్తూ రైతులకు అండగా ఉంటుందన్నారు. అనంతరం వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ..రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ప్రతీ ధాన్యం గింజను ప్రభుత్వ మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందన్నారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. రైతులు సరైన తేమశాతంతో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధరను పొందాలన్నారు.



## మంత్రి సురేఖని కలిసిన కాపు సంఘాలు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల పరిధిలోని 29 కాపు, మున్నూరు కాపు సంఘాల నాయకులు, ప్రతినిధులు, జేఏసీ ప్రతినిధులు శనివారం మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య ఆధ్వర్యంలో అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖని హైదరాబాద్ జూబ్లీహిల్స్ లోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కాపు సమాజం ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వపరంగా వారికి అందించాల్సిన సహాయ, సహకారాల గురించి మంత్రి సురేఖకు వారు వివరించారు. బీసీల ఉన్నతికి, కాపు సమాజ పురోగతికి ప్రభుత్వపరంగా, వ్యక్తిగతంగా మంత్రి సురేఖ అందిస్తున్న చేయూతను ఈ సందర్భంగా వారు ప్రశంసించారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేసి తమ చిత్తశుద్ధిని చాటుకున్నామని మంత్రి తెలిపారు. అతి త్వరలో మున్నూరు కాపు కార్పొరేషన్ కు చైర్మన్ ను నియమించి, కాపు సమాజం సంక్షేమం, అభివృద్ధి పై పటిష్ట కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగుతామని మంత్రి సురేఖ స్పష్టం చేశారు.

# మీ సేవలు స్ఫూర్తిదాయకం

- వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ
- ఉద్యోగ విరమణ పొందిన వారికి ఘన సన్మానం

**వరంగల్ వాయిస్, క్రైం :** ఎన్నో త్యాగాలు, కష్టనష్టాలను అధిగమించి విజయవంతంగా విధులు నిర్వహించిన మీరూ నేటి తరం పోలీసులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తారని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ అన్నారు. వరంగల్ పోలీస్ విభాగంలో సుధీర్ఘకాలంగా విధులు నిర్వహించి శనివారం పదవీవిరమణ చేస్తున్న అధికారులను సీపీ ఘనంగా సత్కరించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి సీపీ ముఖ్య అతిథిగా హాజరై ఉద్యోగ విరమణ పొందుతున్న ఆర్ఎస్ఐ అబ్దుల్ ఖయ్యుమ్, ఎస్సై గణపతి, ఏఎస్సైలు సాంబయ్య, రుషేంద్రమని, నర్సింహులు, హెడ్ కానిస్టేబుల్ రాజేంద్రప్రసాద్ లను ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాతుడుతూ సుదీర్ఘ కాలం పోలీస్ శాఖలో పనిచేయడంమే కాకుండా క్లిష్టసమయాల్లో విధులు నిర్వహించి నేడు శాంతియుతమైన వాతరణం కల్పించడంలో వీరు ప్రధాన భూమికను నిర్వహించారంటూ కొనియాడారు. ముఖ్యంగా పోలీసులు తమ విధుల్లో రాణించేందుకు వారి కుటుంబ సభ్యులు అందిస్తున్న సహకారమే అన్నారు. ఈ కార్యక్రమములో



అదనపు డీసీపీలు రవి, సంజీవ్, సురేష్కుమార్, ఏసీపీ, ఆర్ఐలు సతీష్, స్పర్జన్ రాజ్, శ్రీధర్, ఆర్ఎస్సై సాయి కిరణ్ తో పాటు పదవీవిరమణ పొదిన పోలీస్ సిబ్బంది కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

### రౌడీ షీటర్ పై పీడీయాక్ట్

నగర ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, హత్యకు పాల్పడిన కాశిబుగ్గ మధురనగర్ ప్రాంతానికి చెందిన గడ్డం సంపత్ పై వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ శనివారం పీడీయాక్ట్ నమోదు చేశారు. ఈ మేరకు సీపీ ఉత్తర్వులను మిల్స్ కాలనీ ఇన్ స్పెక్టర్ వెంకటరత్నం హుజూరాబాద్ సబ్ జైల్ లో న్న నిందితుడికి అందజేయడంతోపాటు సంపత్ ను చర్లపల్లి జైలుకు తరలించారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com